E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

28-3-2025 శుక్రవారం | పేజీలు-6 | హైదరాబాద్ | ekaburu.com



తెలంగాణ శాసనసభ నిరవధిక వాయిదా 2లో



## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిందెంత?

**కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు.**

**ఈ-కబురు హైదరాబాద్:**
కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతి పనిలోనూ గత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నవారు.. కేంద్రం తీరుపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై విమర్శలు 2లో



## డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా

## సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం

- "జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం?"
- "లోక్‌సభ ప్రాతినిధ్యం తగ్గుదలపై దక్షిణాది రాష్ట్రాల ఆందోళన"
- "కేంద్ర పన్నుల పంపిణీలో దక్షిణాదికి అన్యాయం ఉత్తరాది రాష్ట్రాలకు ప్రాధాన్యత?"
- "పునర్విభజన చట్టంలో ఉన్నా.. ఏపీ, తెలంగాణ శాసనసభ సీట్లు పెంచే ప్రసక్తే లేకుండా పోయిందా?"

**ఈ-కబురు హైదరాబాద్:**
డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తరువాయి 2లో


## అవినీతి కేసులో త్వరలో జైలుకి వెళ్లాల్సిందే!

**బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.**

**ఈ-కబురు హైదరాబాద్:**
బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ, డ్రోన్ ఎగరవేశారని ఒక ఎంపీ మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారు. రూ.500 జరిమానా వేసే కేసులో జైలులో పెట్టి వేధించారని సీఎం అన్నారు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను. నేను కూడా అలా ప్రతీకార రాజకీయాలు చేయదలిస్తే.. తరువాయి 2లో



3లో



## అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించేందుకు చేతులు కలిపారో.. జాగ్రత్త..!

**కెనడా, ఐరోపా సమాఖ్యలు కలిసి తమ దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తే సహించనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు.**

**ఈ-కబురు:**
తమ దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడానికి ఐరోపా సమాఖ్య, కెనడా చేతులు కలిపితే మరింత భారీగా టారిఫ్‌లను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ప్రస్తుతం ప్రకటించిన మొత్తం కంటే చాలా ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అమెరికా దిగుమతి చేసుకొనే ఆటో మొబైల్స్‌పై 25శాతం సుంకాన్ని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక ట్రంప్ నిర్ణయంపై ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ నిర్ణయం వ్యాపారాలకు ఏమాత్రం మంచిదికాదు. 2లో

3లో



## సీఏ విద్యార్థులకు బిగ్ అలర్ట్.. ఇకపై ఫైనల్ పరీక్షలూ ఏడాదికి మూడుసార్లు

చార్టెర్డ్ అకౌంటెంట్(సీఏ) పరీక్షలకు సంబంధించి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది.

**ఈ-కబురు దిల్లీ:**
చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ) పరీక్షలకు సంబంధించి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. 2025 నుంచి సీఏ ఫైనల్ పరీక్షల్ని సైతం ఏడాదికి మూడుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది మార్చిలో సీఏ 2లో

## మాతృవందన యోజన అమలు లోపభూయిష్టం

**గర్భిణుల కోసం కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) అమలు లోపభూయిష్టంగా ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆరోపించారు.**

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ విమర్శ

**ఈ-కబురు దిల్లీ:**
గర్భిణుల కోసం కేంద్రప్రభుత్వం 2లో



## అమిత్ షా వ్యాఖ్యలపై సభాహక్కుల నోటీసు

**కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ బుధవారం రాజ్యసభకు సభాహక్కుల నోటీసు సమర్పించింది.**

సోనియాపై వ్యక్తిగత నిందారోపణలు చేశారన్న కాంగ్రెస్

2లో



## ఎన్నికల్లో ఓటమితో నిరుత్సాహపడే వ్యక్తిని కాదు: శరద్ పవార్

**ఎన్నికలు జరగనున్న బిహార్, కేరళ వంటి రాష్ట్రాలపై దృష్టి సారించాలని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ పార్టీ శ్రేణులకు సూచించారు.**

ఒక ఎన్నికలో ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడే వ్యక్తిని కాదని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ తెలిపారు. భవిష్యత్తు ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దిల్లీలో నిర్వహించిన జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి పవార్ ప్రసంగిస్తూ.. పార్టీని బలోపేతం చేయాలని, ఎన్నికలు 2లో



## తెలంగాణ అసెంబ్లీలో కాగ్ నివేదిక.. ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి

**తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టారు.**

**ఈ-కబురు హైదరాబాద్:**
తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టారు. 202324 ఆర్థిక ఏడాది ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించారు. ఇందులో 202324 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని తెలిపారు. జీఎస్డీపీలో వ్యయం అంచనా 15 శాతంగా పేర్కొన్నారు. ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు అయింది. అదనంగా రూ.1,11,477 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

**కాగ్ నివేదిక ప్రకారం..**

- వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ ద్వారా రూ.10,156 కోట్లు తీసుకున్న ప్రభుత్వం
- రూ.35,425 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌ను 145 రోజుల పాటు వాడుకుంది
- 202324లో వడ్డీల చెల్లింపుల కోసం రూ.24,347 కోట్ల వ్యయం
- వేతనాలకు రూ.26,981 కోట్లు ఖర్చు
- ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.83 శాతం నిధులు
- 202324లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు మొత్తం రూ.9,934 కోట్లు
- రెవెన్యూ రాబడుల్లో 45 శాతం వేతనాలు, వడ్డీ చెల్లింపులు, పింఛన్లకే ఖర్చు
- రెవెన్యూ మిగులు రూ.779 కోట్లు
- రెవెన్యూ లోటు రూ.49,977 కోట్లు, జీఎస్డీపీలో రెవెన్యూ లోటు 3.33 శాతం
- 202324 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు రుణాల మొత్తం 4,03,664 కోట్లు
- 202324 ముగిసే వరకు జీఎస్డీపీలో అప్పులు 27 శాతం
- 202324 వరకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ.2,20,607 కోట్లు
- 202324లో మూలధనం కింద రూ.43,918 కోట్ల ఖర్చు
- స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.76,773 కోట్లు
- స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో 11 శాతం పెరుగుదల

## కాంగ్రెస్ రుణమాఫీతో రైతులు అటూ ఇటూ కాకుండా పోయారు

**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన రుణమాఫీతో రైతులు అటూ ఇటూ కాకుండా పోయారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విచారం వ్యక్తం చేశారు.**

రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్



**ఈ-కబురు, దిల్లీ:**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన రుణమాఫీతో రైతులు అటూ ఇటూ కాకుండా పోయారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ సగం మందికే పరిమితమైందని భారాస సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆమె పై విధంగా స్పందించారు. ఆమె బుధవారం రాజ్యసభలో బ్యాంకింగ్‌లాస్ అమెండ్‌మెంట్ బిల్లుపై జరిగిన చర్చకు బదులిచ్చారు. ఆమె మాట్లాడుతూ "వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ భారాస తెలంగాణలో అధికారంలో ఉన్నప్పుడు రుణమాఫీ చేసి తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ఆదుకుందని పేర్కొన్నారు. భారాస హయాంలో చేసిన రుణమాఫీ గురించి నేనేమీ వ్యాఖ్యానించడంలేదు. కానీ కాంగ్రెస్ హయాంలో అమలుచేసిన రుణమాఫీ సగం మంది రైతులకు అందలేదని ఆయన పేర్కొన్నారు. మేం కూడా అదే విషయాన్ని పదేపదే చెబుతూ వస్తున్నాం. కాంగ్రెస్ వాళ్లు రుణమాఫీ ప్రకటించి వాస్తవంగా అది చేయడంలేదు. సగం తరువాయి 2లో

## రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: ఉత్తమ్

**రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.**

**ఈ-కబురు దేవన్నపేట:**
రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ములుగు జిల్లా దేవన్నపేట పంపుహౌస్ వద్ద ఆయన దేవాదుల ప్రాజెక్టు పంపులను ప్రారంభించారు. ఒక మోటార్ ఆన్ చేసి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి గోదావరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేరుకున్నాయి. 3లో

## త్వరలో.. భారత్‌లో పర్యటించనున్న పుతిన్!

**భారత్ పర్యటనకు రావాల్సిందిగా ప్రధాని మోదీ చేసిన ఆహ్వానాన్ని తమ దేశాధినేత పుతిన్ అంగీకరించినట్లు రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు.**

**ఈ-కబురు:**
రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. భారత్ పర్యటనకు రావాల్సిందిగా ప్రధాని మోదీ చేసిన ఆహ్వానాన్ని తమ దేశాధినేత పుతిన్ అంగీకరించినట్లు రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. "రష్యా అండ్ ఇండియా: టువర్డ్ ఏ బైలాటరల్ అజెండా" పేరుతో రష్యన్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కౌన్సిల్ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో లావ్రోవ్ మాట్లాడుతూ.. ఈ పర్యటన కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేప



ట్టిన ప్రధాని మోదీ . తొలి అంతర్జాతీయ పర్యటన రష్యాలో చేసిన విషయాన్ని లావ్రోవ్ గుర్తుచేశారు. ఇప్పుడు తమవంతు వచ్చిందన్నారు. అయితే, పర్యటన తేదీలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

**పుతిన్ త్వరలో చనిపోతాడు.. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన జెలెన్‌స్కీ**

ఇదిలాఉంటే, ప్రధాని మోదీ గతేడాది జులైలో రష్యాలో పర్యటించారు. ఐదేళ్ల వ్యవధి తర్వాత అక్కడ పర్యటించడం అదే తొలిసారి. అంతకుముందు 2019లో రష్యాలోని వ్లాదివోస్టోక్ నగరంలో నిర్వహించిన ఆర్థిక సదస్సులో మోదీ పాల్గొన్న సంగతి తెలిసింది. ఇటీవల రష్యా పర్యటన సందర్భంగా భారత్‌కు రావాలని పుతిన్‌ను మోదీ ఆహ్వానించారు. అమెరికా నుంచి టారిఫ్‌ల ముప్పు, ఉక్రెయిన్‌రష్యా యుద్ధం ముగింపునకు సంప్రదింపులు జరుగుతోన్న సమయంలో పుతిన్ భారత్‌లో పర్యటించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



## తెలంగాణ శాసనసభ నిరవధిక వాయిదా

**తెలంగాణ శాసనసభ నిరవధిక వాయిదా పడింది. మొత్తం 11 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు సాగాయి.**

**ఈ-కబురు హైదరాబాద్:**
తెలంగాణ శాసనసభ నిరవధిక వాయిదా పడింది. మొత్తం 11 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు సాగాయి. 97 గంటల 32 నిమిషాల పాటు సభ కొనసాగింది. 12 బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ మేరకు శాసనసభ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం

మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడారు. "డీలిమిటేషన్ వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలి. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలి. జనాభా నియంత్రణపై కేంద్రం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించలేదు. ప్రస్తుతం డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదికన జరుగుతోంది.

1971లో రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్‌ను 25 ఏళ్లు నిలిపేశారు. డీలిమిటేషన్‌పై గందరగోళం నెలకొంది. ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ డీలిమిటేషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించబోమని తీర్మానం చేశారు. జనాభా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌ను వాజ్ పేయీ కూడా వ్యతిరేకించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కొందరు అంటున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. డీలిమిటేషన్ జరిగితే ఇది 19 శాతానికి పడిపోతుంది.

దీనికి వ్యతిరేకంగా అందరూ ఒకే మాటపై ఉండాలి. ప్రభుత్వం పెట్టే తీర్మానానికి పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలి. ఏపీ, తెలంగాణ శాసనసభ నియోజకవర్గాలు పెంచాలని పునర్విభజన చట్టంలో ఉంది. ఇప్పటి వరకు శాసనసభ నియోజకవర్గాలను పెంచలేదు. 2011 జనాభా లెక్కల ప్రకారమే సిక్కిం, జమ్మూ కశ్మీర్ నియోజకవర్గాలను పెంచారు. రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు పెంచలేదు. 24 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయి. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు చాలా తక్కువ వస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌కు మాత్రం కేంద్రం పన్నుల్లో ఎక్కువ వాటా ఉంది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించేందుకు చేతులు కలిపారో.. జాగ్రత్త..!

మొదటి పేజీ తరువాయి.

వినియోగదారుల కోణంలో దారుణమైంది" అని విమర్శించారు. మరోవైపు కెనడా ప్రధాని మార్క్ కార్నీ కూడా ట్రంప్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. కెనడా కార్మికులపై ప్రత్యక్షదాడిగా పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రతీకార చర్యలను తాము పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.



**వాడు గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లోకి వెళ్లగానే దాడి చేశాం: అమెరికా యుద్ధ ప్లాన్లు**

మరోవైపు ఐరోపా సమాఖ్య తన ప్రతిఘటన నిర్ణయాలను ఏప్రిల్ మధ్య వరకు వాయిదా వేసింది. వీటిల్లో అమెరికా బర్బన్‌పై 50శాతం సుంకాల విధింపు కూడా ఉంది. ఈ నిర్ణయం అమలు చేస్తే.. తాము ఐరోపా వైన్లు, ఆల్కహాల్‌పై 200శాతం పన్ను విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు.

ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆటోమొబైల్స్ దిగుమతులపై అదనపు సుంకాల నిర్ణయం అమల్లోకి రానుంది. దీంతో అమెరికాలోకి దిగుమతి అయ్యే కార్లు, తేలికపాటి ట్రక్కుల ధరలు పెరగనున్నాయి.

# అమిత్ షా వ్యాఖ్యలపై సభాహక్కుల నోటీసు

**ఈ-కబురు ఢిల్లీ:**
కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ బుధవారం రాజ్యసభకు సభాహక్కుల నోటీసు సమర్పించింది. ఒక బిల్లుకు సంబంధించిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్రమంత్రి అమిత్ షా కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీకి వ్యతిరేకంగా వ్యక్తిగత నిందారోపణలకు పాల్పడ్డారని రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్‌విప్ జైరాం రమేశ్ తన నోటీసులో పేర్కొన్నారు. విపత్తుల నిర్వహణ బిల్లు 2024పై రాజ్యసభలో మంగళవారం జరిగిన చర్చలో అమిత్‌షా మాట్లాడుతూ "కాంగ్రెస్ హయాంలో ప్రధానమంత్రి సహాయ నిధి కేవలం ఒక కుటుంబం గుప్పిట్లో ఉండేదని, ప్రధానమంత్రి సహాయనిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసినా అందులో కాంగ్రెస్ అధ్యక్షుడు సభ్యుడుగా ఉండేవారు" అని వ్యాఖ్యానించినట్టు జైరాం రమేశ్ రాజ్యసభ ఛైర్‌పర్సన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు సమర్పించిన హక్కుల నోటీసులో పేర్కొన్నారు.



పెమ్మసాని అబద్ధపు ప్రకటన చేశారు..
కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ సభాహక్కుల నోటీసు జారీ చేసింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సభను తప్పుదోవ పట్టించేలా ఆయన ప్రకటన చేశారని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాగూర్ బుధవారం వెల్లడించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి తమిళనాడుకు అందాల్సిన రూ.4,034 కోట్లను ఐదు నెలలుగా విడుదల చేయకుండా నిలిపి ఉంచారంటూ డీఎంకే సభ్యురాలు కనిమొళి ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా పెమ్మసాని చంద్రశేఖర్ వాస్తవ విరుద్ధమైన ప్రకటన చేశారన్నారు. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించిన నోటీసులో కాంగ్రెస్ విప్ పేర్కొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిందెంత?

మొదటి పేజీ తరువాయి

గుప్పించారు. "తెలంగాణకు మేలు జరగాలి. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. రాష్ట్రం బాగుండాలన్నదే మా సంకల్పం. పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడకపోవడం బాధేసింది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రథకాలను కేంద్రం అనుకరిస్తోంది. మనకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం ఎందుకు మాట్లాడటం లేదు?

పార్లమెంట్ ఎన్నికల్లో మాకు ఒక్క సీటు కూడా రాలేదని విమర్శిస్తున్నారు. మాకు వచ్చింది సున్నానే.. మరి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకి వచ్చింది గుండు సున్నా కాదా. కొట్లాడకపోతే కేంద్రం నిధులు ఇవ్వదు... పోరాడాల్సిందే. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు మేం కూడా మద్దతిస్తాం. సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. మేం కూడా అప్పట్లో కేంద్రంతో సఖ్యతతోనే ఉన్నాం. ఏమీ రాలేదు. తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు కేంద్రం ఒక్క రూపాయి అయినా ఇచ్చిందా? సమ్మక్కసారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి. కుంభమేళాకు నిధులు ఇస్తున్న కేంద్రం.. సమ్మక్కసారలమ్మ జాతరకు ఎందుకు ఇవ్వదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.



**స్థిరాస్తి రంగం కుప్పకూలింది**
ఫార్మా సిటీపై ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. "ఒకసారి ఫ్యూచర్ సిటీ అంటారు. మరోసారి ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అంటారు. ఈ ప్రభుత్వ విధానాల వల్ల స్థిరాస్తి రంగం కుప్పకూలింది. వ్యాపారం జరగక స్థిరాస్తి వ్యాపారులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ తన సొంత అవసరాల కోసం నిర్మించలేదు. కాళేశ్వరం కూలిపోతే.. మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తీసుకువస్తారు?

**తులం బంగారం ఎక్కడ?**
అద్దెలు చెల్లించకపోవడంతో గురుకుల భవనాలకు తాళాలు వేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే మేం కూడా చెల్లించాం. ఈ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చింది 11 వేల ఉద్యోగాలు మాత్రమే. మేం పరీక్షలు నిర్వహించిన వాటికే వీళ్లు నియామకపత్రాలు ఇచ్చారు. గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తామన్నారు.. చేయలేదు. కోటి మంది మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామన్నారు. కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం కోసం ఎదురు చూస్తున్నారు.

పేరుకు ప్రజా పాలన.. చేసేది ప్రజా పీడన. విఫల పాలనకు విజయోత్సవాలు చేస్తున్నారు. ప్రజలు గోల్డ్ అని వీళ్లకు ఓట్లేశారు. కానీ, రోల్డ్ గోల్డ్ అని తేలింది. రేవంత్‌రెడ్డి ఎందుకు జైలుకెళ్లారు? స్వాతంత్ర్య పోరాటం చేసి ఆయన జైలుకు వెళ్లారా? మీ ఇంటిపై డ్రోన్ ఎగరేస్తే మీరు ఊరుకుంటారా? కుటుంబాలు మీకే ఉంటాయా.. మాకు ఉండవా? నేను కూడా తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ జైలుకు వెళ్లా" అని కేటీఆర్ అన్నారు.

# అవినీతి కేసులో త్వరలో జైలుకి వెళ్లాల్సిందే!

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే కొందరు జైలులో ఉండేవారు. కేటీఆర్, కేసీఆర్‌ను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్షపూరిత రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు" అని రేవంత్ అన్నారు.

**"భారాస మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసింది. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్లు మాఫీ చేశారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8,500 కోట్లకు పైగా అయ్యింది. మేం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.26వేల కోట్లు రుణమాఫీ చేశాం. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకొని రైతుబంధు కూడా వేయలేదు. భారాస ఎగవేసిన రైతుబంధు రూ. 7,625 కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని మాజీ సీఎం స్వయంగా బెదిరించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చాం" అని రేవంత్ తెలిపారు.**



కమీషన్ల కోసం ప్రాజెక్టుల రీడిజైన్
ప్రాజెక్టుల కోసం పేదల భూములు తీసుకున్న కేసీఆర్.. వాళ్ల బంధువుల భూములు మాత్రం తప్పించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న రైతులు ఆందోళన చేయలేదా? అని ప్రశ్నించారు. 14 గ్రామాల ప్రజలను పోలీసులతో కొట్టించి బలవంతంగా భూసేకరణ చేశారన్నారు. "ప్రాజెక్టు వద్ద ఎవరికి భూములు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కాలువలు తీసినట్లు నిరూపిస్తాను. నేను భూసేకరణను వ్యతిరేకించలేదు.. పరిహారం చెల్లించాలని ధర్నాలు చేశాను. కమీషన్ల కోసం ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశారు. రూ.36వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి.. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం చేపట్టారు. కాళేశ్వరం అవినీతి విషయంలో త్వరలోనే వీళ్లు జైలుకు వెళ్తారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చింది" అని రేవంత్ అన్నారు.

## ...ఫైనల్ పరీక్షలూ ఏడాదికి మూడుసార్లు

మొదటి పేజీ తరువాయి

ఇంటర్, ఫౌండేషన్ కోర్సు పరీక్షలను ఏడాదికి మూడుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఐసీఏఐ.. తాజాగా సీఏ ఫైనల్ పరీక్షలను సైతం అదే తరహాలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

**2025లో జాబ్ కొట్టాలంటే.. ఈ స్కిల్స్ నేర్చుకోవాల్సిందే..!**
ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులకనుగుణంగా విద్యార్థులకు గొప్ప అవకాశాలను అందించేందుకు సీఏ ఫైనల్ పరీక్షల్ని సైతం ఏడాదిలో మూడుసార్లు నిర్వహించేలా చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. తాజా నిర్ణయంతో సీఏ ఫైనల్, ఇంటర్, ఫౌండేషన్ పరీక్షలు ఏడాదిలో మూడుసార్లు జరుగుతాయని పేర్కొంది. ఈ పరీక్షలు జనవరి, మే, సెప్టెంబర్ నెలల్లో జరుగుతాయని స్పష్టం చేసింది. దీంతో విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయని పేర్కొంది.

# మాతృవందన యోజన అమలు లోపభూయిష్టం

మొదటి పేజీ తరువాయి.

తీసుకొచ్చిన ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) అమలు లోపభూయిష్టంగా ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆరోపించారు. ఈ పథకానికి నిధులు అంతంతమాత్రంగానే కేటాయిస్తున్నారని విమర్శించారు. బుధవారం రాజ్యసభ శూన్యగంటలో ఆమె మాట్లాడారు. "2013లో కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా గర్భిణులకు రెండు విడతల్లో రూ.6,000 చెల్లించేవారు. 2017 నుంచి పీఎంఎంవీవై కింద రూ.5,000 మాత్రమే ఇస్తున్నారు. 2022 23 లెక్కలను విశ్లేషిస్తే.. తొలిసారి గర్భం దాల్చిన వారిలో 68 శాతం మంది కనీసం ఒక విడత సొమ్ము అందుకున్నారు. కానీ ఆ తర్వాతి ఏడాది ఆ సంఖ్య 12 శాతానికి పడిపోయింది. బడ్జెట్‌లో పీఎంఎంవీవైకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం సరికాదు. సమర్థ్య అనే కార్యక్రమంలో భాగంగా అమలవుతున్న ఐదు పథకాల్లో ఇది ఒకటి. సమర్థ్యకు 202526లో కేవలం రూ.2,521 కోట్లు కేటాయించారు. ఇవి నామమాత్రపు కేటాయింపులు" అని సోనియాగాంధీ విమర్శలు గుప్పించారు.



# అమిత్ షా వ్యాఖ్యలపై సభాహక్కుల నోటీసు



మొదటి పేజీ తరువాయి

మంది రైతులకు ఆ ప్రయోజనం దక్కకపోయినా ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లు చెప్పినందున అన్నదాతలందరూ దాని పరిధిలోకి వస్తున్నారని బ్యాంకులు పరిగణిస్తుంటాయి. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రుణాలను రద్దుచేస్తే ఆ తర్వాత కొత్తవి అందుకోవడానికి అర్హత ఉండదు. ఇలాంటి హామీలతో కాంగ్రెస్ రైతులకు సేవచేయడానికి బదులు నష్టం చేస్తోంది. 2008లో యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలుచేసిన దారుణమైన రుణమాఫీ కారణంగా ఆ తర్వాత రైతులకు రుణాలు దక్కని పరిస్థితి నెలకొంది" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

# ఎన్నికల్లో ఓటమితో నిరుత్సాహపడే వ్యక్తిని కాదు: శరద్ పవార్

మొదటి పేజీ తరువాయి

జరగనున్న బిహార్, కేరళ వంటి రాష్ట్రాలపై దృష్టి సారించాలని చెప్పారు.

గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యూబీటీ), కాంగ్రెస్‌లతో కలిసి బరిలోకి దిగిన ఎన్సీపీ (ఎస్పీ).. తాను పోటీ చేసిన 86 సీట్లలో కేవలం 10 సీట్లకే పరిమితమైన విషయం తెలిసిందే.

ఈ ఫలితాల అనంతరం పార్టీ ఎక్స్‌టెండెడ్ వర్కింగ్ కమిటీ తొలి సమావేశం ఇది. నూతనోత్సాహంతో పని చేయాలని,



భవిష్యత్తు సవాళ్లకు పార్టీని సిద్ధం చేయాలని పవార్ సూచించారు. ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ, ముఖ్యంగా వ్యవసాయ రంగం పరిస్థితి దుర్భరంగా మారిందని విమర్శించారు. శాసనసభలో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని సమావేశంలో మాట్లాడిన పలువురు నేతలు ఆరోపించారు. రాష్ట్రంలో విద్వేషపూరిత ప్రసంగాలు పెరుగుతుండటం, నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఎదురయ్యే సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేశారు.

మహారాష్ట్రను మత రాజకీయాలకు ప్రయోగశాలగా భాజపా మారుస్తోందని, ఇది ఆందోళనకర విషయమని పార్టీ సీనియర్ నేత జితేంద్ర అవ్హాడ్ ఆరోపించారు.



## బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా విజయ్‌కుమార్ జనరల్ సెక్రటరిగా శ్రీధర్ రెడ్డి ఎన్నిక

**ఈ-కబురు:** నగరంలోని అబిడ్స్‌లో ఉన్న డిఆర్‌టి కోర్ట్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సీనియర్ న్యాయవాది విజయ్‌కుమార్ .. ఉపాధ్యక్షుడిగా కల్యాణ్ చక్రవర్తి ఎన్నికయ్యారు.

జనరల్ సెక్రటరి గా టి. శ్రీధర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా నరేష్ అనుగుల, ట్రెజరర్ గా ఎస్. శ్రీకాంత్, స్పోర్ట్స్ & కల్చరల్ సెక్రటరిగా జి. కిరణ్ రాజ్, లైబ్రేరియన్ గా ఎ . తనూజ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ (మేల్) కె. సురేష్, క్రాంతి కుమార్, పి. బాబు సాయినాథ్ రావు.. ఎగ్జిక్యూటివ్ మెంబర్ (ఫిమేల్) జి. జెస్సిక, మౌనిక ఎన్నికయ్యారు.

ఈ ఎన్నికలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన వారికి న్యాయవాదులంతా అభినందనలు తెలియజేశారు.
అనంతరం మాజీ ప్రెసిడెంట్ జి కె నివాసానికి వెళ్ళి ఆయనకు ఎన్నికల్లో గెలుపొందిన ప్రెసిడెంట్ టి.విజయ్‌కుమార్ , ఉపాధ్యక్షు డు కల్యాణ్ చక్రవర్తి, జనరల్ సెక్రటరి టి. శ్రీధర్ రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు



## తగ్గేదేలే అంటున్న కిమ్.. ఏఐతో సరికొత్త ప్లాన్

**సియోల్:** ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తమ దేశ సైనిక బలంపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే పలు మిస్సైల్‌స్‌ను పరీక్షించిన కిమ్.. తాజాగా అత్యాధునిక డ్రోన్ల పని తీరును పర్యవేక్షించారు. ఏఐ సాంకేతికతతో కూడిన ఆత్మాహుతి డ్రోన్లను ఉత్తరకొరియా తయారు చేసినట్టు అక్కడి అధికారిక మీడియా కథనాలు వెల్లడించాయి.
అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఇటీవల డ్రోన్ల ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టిసారించారు. తాజాగా కృత్రిమ మేధస్సు తో తయారుచేసిన అత్యాధునిక డ్రోన్ల పరీక్షను ఆయన పర్యవేక్షించారు. భూమిపై, సముద్రంలో వ్యూహాత్మక లక్ష్యాలను, శత్రు కార్యకలాపాలను గుర్తించే సామర్థ్యం కలిగిన అత్యాధునిక నిఘా డ్రోన్‌ల పరీక్షను కిమ్ పర్యవేక్షించినట్లు నార్త్ కొరియా మీడియా వెల్లడించింది. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ..'ఆయుధాల ఆధునికీకరణలో మానవరహితమైనవి, కృత్రిమ మేధస్సు సాంకేతికతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి' అని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది.
ఇదిలా ఉండగా.. అమెరికా, దాని మిత్ర దేశాలకు ఉత్తరకొరియా హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా దక్షిణ కొరియాలోని బుసాన్ పోర్ట్‌లో అమెరికాకు చెందిన విమాన వాహక నౌకను మోహరించారు. ఇది కిమ్ ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది. 'అమెరికాలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉ.కొరియాపై రాజకీయంగా, సైనికంగా రెచ్చగొట్టే చర్యలను ముమ్మరం చేసింది. గత ప్రభుత్వ (బైడెన్ ప్రభుత్వం) శత్రుత్వ వైఖరినే ఇది ముందుకు తీసుకెళ్తోంది' అని కిమ్.. తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తామూ రెచ్చగొట్టే చర్యలు చేపడతామని బెదిరించారు. ఆయుధ పరీక్ష కార్యకలాపాలను మరింత తీవ్రతరం చేస్తామంటూ వ్యాఖ్యలు చేశారు.

## ఏఐ దూసుకొచ్చినా.. ఆ మూడు ఉద్యోగాలు సేఫ్: బిల్‌గేట్స్

**ఏఐతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన ఉంది. మరి ఈ భయంలేని రంగం ఉందా..? దీనిపై బిల్‌గేట్స్ సమాధానం ఇచ్చారు.**



**ఈ-కబురు :** కృత్రిమ మేధ(ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం అవుతుండగా.. వాటి వల్ల కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రముఖ సంస్థల అధినేతలు చెప్తున్నారు. ఇదే అంశంపై తాజాగా మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ స్పందించారు. ఏఐతో రానున్న రోజుల్లో ఎన్నో ఉద్యోగాలు నిరుపయోగంగా మారతాయని అన్నారు. మిగతా వాటితో పోల్చుకుంటే.. మూడు వృత్తులకు మాత్రం ఈ ఆటోమేషన్ ముప్పు కాస్త తక్కువని అంచనావేశారు. కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ రంగాలు దీనిని తట్టుకొని నిలబడతాయని చెప్పారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత, పరిస్థితులకు తగ్గట్టుగా సామర్థ్యాన్ని మెరుగుపర్చుకునే లక్షణాన్ని ఏఐ ఇంకా సొంతం చేసుకోలేకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు ఏఐతో కోడింగ్ ఉద్యోగాలు పోవచ్చనే ఆందోళన ఉంది. కోడ్‌ను రూపొందించడంలో, కొన్ని ప్రోగ్రామింగ్ టాస్క్‌లకు మనుషుల అవసరం లేకుండా ఏఐతో పనికానియొచ్చు. కానీ కచ్చితత్వం, లాజిక్, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాల్లో మాత్రం మనుషుల కంటే వెనకబడే ఉంది. క్లిష్టమైన సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు ఈ లక్షణాలన్నీ కావాలి మరి. డీబగ్గింగ్, ఏఐను మెరుగుపర్చడంలో ప్రోగ్రామర్స్ కీలకమని బిల్‌గేట్స్ అభిప్రాయపడుతున్నారు. చాట్‌జీపీటీ వంటి ఏఐ టూల్స్ కోడ్ రాయడంలో ఉపయోగపడతాయి. అనుకోకుండా వచ్చే సవాళ్లను పరిష్కరించాలంటే ప్రోగ్రామర్స్ అవసరం ఉంటుందని చెప్పారు. ఇదిలాఉంటే.. గతంలో ప్రధాని మోదీ ఏఐ ఆందోళన గురించి మాట్లాడుతూ.. ''ఈ సాంకేతికత వల్ల మనం చేసే అన్ని పనుల్లో మార్పులు వస్తాయి. దానితో ఉద్యోగాలు పోతాయనే వదంతులు ప్రచారంలో ఉన్నాయి. చరిత్ర చూస్తే.. పని ఎప్పుడూ ఉంటుంది. అయితే పనిచేసే పద్ధతిలో మార్పులు వస్తుంటాయి. కొత్తరకం ఉద్యోగాల సృష్టి జరుగుతోంది. వాటిని అందిపుచ్చుకోవడం కోసం స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ అవసరం. ఉద్యోగాల్లో నైపుణ్యం పెంచుకునే వారికే ఉన్నతావకాశాలుంటాయి'' అని వెల్లడించారు.

# మహిళా కాంగ్రెస్ డివిజన్ కమిటీల నియామకం

**మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం : చంద్రిక ప్రసాద్**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్ల మహిళా కాంగ్రెస్ కమిటీల నియామకాన్ని నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సునీతా రావు పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీ జ్యోతి బీమ్ భరత ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని డివిజన్లో మహిళా కాంగ్రెస్ కమిటీల నియామకం చేపడుతున్నారు. అందులో భాగంగా గురువారం మియాపూర్, వివేకానంద నగర్, హైదర్ నగర్ డివిజన్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు రాష్ట్ర మహిళ కాంగ్రెస్ సెక్రెటరీ రమాదేవి, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీదేవి, వైస్ ప్రెసిడెంట్ పి శాంతా, శేర్లింగంపల్లి జనరల్ సెక్రెటరీ భవాని , కృష్ణకుమారి, నియోజకవర్గ సెక్రెటరీ జ్యోతి, మియాపూర్ అధ్యక్షురాలు సుప్రజ, వివేకానంద నగర్ అధ్యక్షురాలు నాగమణి , హైదర్ నగర్ అధ్యక్షురాలు విమలలతో కలిసి చంద్రిక ప్రసాద్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రిక ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేయాలని పిలుపునిచ్చారు.



నూతన డివిజన్ కమిటీ సభ్యులతో చంద్రిక ప్రసాద్ తదితరులు

## స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కలిసిన అనిల్ కుమార్ యాదవ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా స్పీకర్ కార్యాలయంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు విషయాలపై స్పీకర్ తో చర్చించారు అనంతరం అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పురోభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అన్ని రంగాలకు ప్రాధాన్యం కల్పిస్తూ ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో బడ్జెట్ రూపకల్పన చేపట్టారని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా శాసనసభ సమావేశాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా, పారదర్శకంగా, సమర్థవంతంగా ఉందన్నారు. బడ్జెట్ పై దాదాపు 12 రోజులు రాష్ట్ర శాసనసభలో సుదీర్ఘంగా చర్చించి, బిల్ కి ఆమోదం తెలిపిందన్నారు. సమావేశాల సందర్భంగా సభను విజయవంతంగా నడిపించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా పాలసీ శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు.



తెలంగాణ స్పీకర్ తో సమావేశమైన అనిల్ కుమార్ యాదవ్



## రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: ఉత్తమ్

మొదటి పేజి తరువాయి

అనంతరం అక్కడ ఇద్దరు మంత్రులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 15 రోజుల్లో మరో మోటార్ ఆన్ చేస్తామన్నారు. గత ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని, ఈ ఏడాది చివరికల్లా దేవాదుల ప్రాజెక్టు అన్ని దశల పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

## బంగారం, డాలర్లతో ఉడాయించిన నిందితుడు రిమాండ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
నగర వ్యాపారులను బురిడీ కొట్టించి బంగారు బిస్కెట్లు అమెరికన్ డాలర్లతో పారిపోయిన ఘరానా నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు గురువారం రిమాండ్ కు తరలించారు. గచ్చిబౌలిలో గత శుక్రవారం చోటుచేసుకున్న దోపిడీ అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే . ఈ మేరకు దోపిడీకి పాల్పడిన నిందితుడు పుగల్ వాసన్(49)ను గురువారం రిమాండ్ కు తరలించారు. నగరానికి చెందిన వ్యాపారులను బురిడీ కొట్టించి చంద్రశేఖర్ నుంచి 500 గ్రాముల బంగారం, రఫీ నుంచి 18 వేల డాలర్లతో గత శుక్రవారం నిందితుడు పుగల్ వాసన్ పారిపోయిన విషయం తెలిసిందే. గచ్చిబౌలిలో చోటు చేసుకున్న ఈ చోరీపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. కాగా ప్రత్యేక బృందాల గాలింపు కొనసాగుతుండగానే గత రెండు రోజుల క్రితం కోయంబత్తూరులో అక్కడి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. దీంతో కోయంబత్తూర్ నుంచి పీటీ వారెంట్స్ తీసుకొచ్చిన గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని 10ఎంఎం ఆడిషనల్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాలతో నిందితుడిని సంగారెడ్డి జైలుకు తరలించారు. కేసు విచారణలో భాగంగా మరిన్ని వివరాల కోసం నిందితుడు పుగల్ వాసన్ ను కస్టడీకి ఇవ్వాలని కస్టడీ పిటీషన్ దాఖలు చేశారు. ఒకటి రెండు రోజుల్లో కస్టడీకి తీసుకొని విచారించనున్నారు. కోయంబత్తూర్ లో నివాసం ఉండె పగుల్ వాసన్ స్థానికంగా చేనేత వస్త్రాలు తయారు చేస్తుండేవాడని, వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావడంతో బంగారం కొనుగోలు, కరెన్సీ ఎక్స్చేంజీ పేరిట మోసాలకు పాల్పడటం చేస్తున్నాడని తెలుస్తోంది. కస్టడీకి తీసుకొని గచ్చిబౌలి పోలీసులు పూర్తి స్థాయిలో విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయని పోలీసులు భావిస్తున్నారు.



## శ్రీరామ్ నగర్ కాలనీ ఇఫ్తార్ విందు





ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గాంధీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
పవిత్ర రంజాన్ మాస పర్వదిన వేడుకలను పురస్కరించుకొని సీనియర్ నాయకులు చాంద్ పాషా ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ రామ్ నగర్ కాలనీ ఏ బ్లాక్ లో నిర్వహించిన దవాత్ ఏ ఇఫ్తార్ విందులో తెలంగాణ పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం ను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా అభినదించదగ్గ విషయం అని అన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన "గంగా జమునా తెహజీబ్" మరింతగా పరిఢవిల్లాలని, రంజాన్ పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను అందించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు, మహిళ సోదరీమణులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# రక్షణ మంత్రిత్వ శాఖతో భారత్ ఫోర్జ్ లిమిటెడ్ ఒప్పందం

**భారత్ ఫోర్జ్ లిమిటెడ్, దేశీయంగా అభివృద్ధి చేసిన 184 అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్స్ సరఫరా కోసం రక్షణ మంత్రిత్వ శాఖతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 4,140 కోట్ల విలువైన ఈ ఒప్పందం.. 155mm/52 క్యాలిబర్ ఆర్టిలరీ సిస్టమ్ కోసం మొత్తం రూ. 6,900 కోట్ల సేకరణ కార్యక్రమంలో 60 శాతం ప్రాతినిధ్యం వహిస్తుంది.**

భారత్ ఫోర్జ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ 'బాబా కళ్యాణి', రక్షణ తయారీలో ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు నిదర్శనంగా ఈ ఒప్పందం జరిగిందని అన్నారు. ఈ ఒప్పందం రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో జరిగింది.

ఈ సందర్భంగా, భారత్ ఫోర్జ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బాబా కళ్యాణి మాట్లాడుతూ, ఇది కంపెనీకి గర్వకారణమైన క్షణం అని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ అనే దార్శనికతకు ఇది నిదర్శనం. రక్షణ మంత్రిత్వ శాఖ, భారత సైన్యం, డీఆర్‌డీఓ, ఏఆర్‌డీఈ, భారత్ ఫోర్జ్‌లోని మా బృందం వారి అమూల్యమైన ప్రయత్నాలు.. సహకారాన్ని మేము హృదయపూర్వకంగా అభినందిస్తున్నామని అన్నారు.



# లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. ఆటో షేర్లపై ట్రంప్ దెబ్బ

**ఇండియన్ బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. 30 షేర్ల సెన్సెక్స్ 317.93 పాయింట్లు (0.41 శాతం) పెరిగి 77,606.43 వద్ద స్థిరపడింది. ఈ రోజు సూచీ 77,747.46-77,082.51 రేంజ్‌లో ట్రేడ్ అయింది. అలాగే నిఫ్టీ 50 సూచీ 105.10 పాయింట్లు (0.45 శాతం) లాభంతో 23,591.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 ఇంట్రాడేలో 23,646.45 పాయింట్ల వద్ద గరిష్టాన్ని నమోదు చేయగా, ఇంట్రాడే కనిష్టాన్ని 23,412.20 వద్ద నమోదు చేసింది.**

బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, లార్సెన్ అండ్ టూబ్రో, బజాజ్ ఫైనాన్స్ షేర్లు 2.85 శాతం వరకు లాభాలతో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. అదేసమయంలో టాటా మోటార్స్, సన్ ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు 5.38 శాతం వరకు నష్టపోయాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 1.15 శాతం లాభపడటంతో స్మాల్ క్యాప్ షేర్లు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ కూడా 0.37 శాతం లాభంతో స్థిరపడింది.

నిఫ్టీ ఆటో, ఫార్మా మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. అమెరికాలో తయారు చేయని అన్ని దిగుమతి కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఆటో షేర్లు అమ్మకాలను చవిచూశాయి. నిఫ్టీ ఆటో ఇండెక్స్ గురువారం 1.04 శాతం నష్టంతో స్థిరపడింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ నేతృత్వంలోని నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.50 శాతం లాభంతో స్థిరపడింది.

# రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి క్లాసిక్ 650.. ధర, ఇతర వివరాలు ఇవీ..

**రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ క్లాసిక్ 650 ట్విన్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.3.37 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది.**

దేశీయ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ 650 సీసీ శ్రేణిని మరింత విస్తరిస్తూ మరో కొత్త మోటార్ సైకిల్‌ను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. చాలా రోజులుగా వాహన ప్రియులు ఎదురుచూస్తున్న క్లాసిక్ 650 ట్విన్‌ను ఎట్టకేలకు గురువారం లాంచ్ చేసింది. దీని ధరను రూ.3.37 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) నిర్ణయించింది. ఇందులో బ్లాక్ క్రోమ్ వేరియంట్ ధరను రూ.3.50 లక్షలుగా పేర్కొంది. ఇప్పటికే 650 సీసీ శ్రేణిలో ఇంటర్‌సెప్టర్ 650, కాంటినెంటల్ జీటీ 650, సూపర్ మెటోర్ 650, షాట్‌గన్ 650, బేర్ 650ని కంపెనీ లాంచ్ చేసింది.రాయల్ ఎన్‌ఫీల్డ్ తన కొత్త క్లాసిక్ 650లోనూ నియో రెట్రోలుక్‌ను ఫాలో అయ్యింది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న క్లాసిక్ 350ని ఇది పోలి ఉంటుంది. రౌండ్ హెడ్ ల్యాంప్, టైగర్‌ఐ పైలట్ ల్యాంప్స్‌తో టియర్ డ్రాప్ ఆకారంలో ఫ్యూయల్ ట్యాంక్ ఇచ్చారు. వల్లం రెడ్, బ్రంటింగ్‌థార్ప్ బ్లూ, టీల్, బ్లాక్ క్రోమ్ రంగుల్లో లభిస్తుంది. 19 అంగుళాల ఫ్రంట్ వీల్, 18 అంగుళాల రియర్ వీల్ ఇచ్చారు. వైర్ స్పోక్ వీల్స్ అమర్చారు.
9తో.. మీరూ కావొచ్చు.. ఆర్థిక ఛాంపియన్!
ఇంజిన్ విషయానికొస్తే.. ఇతర 650 సీసీ మోడళ్లలానే ఇందులోనూ 648 ఎయిర్‌ఆయిల్ కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 46.4 హెచ్‌పీ పవర్‌ను, 52.3 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్‌తో 6 స్పీడ్ గేర్ బాక్స్ వస్తోంది. ముందువైపు 320ఎంఎం డిస్క్ బ్రేక్, వెనక వైపు 300 ఎంఎం డిస్క్ బ్రేక్ ఇచ్చారు. డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్ సదుపాయం ఉంది. ఎల్ఈడీ లైటింగ్‌తో వస్తోంది. సెమీ అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, టైప్‌సి ఛార్జింగ్ పోర్ట్, ట్రిప్పర్ నావిగేషన్‌పాడ్ ఉన్నాయి. బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650 వంటి మోడళ్లకు ఈ మోటార్ సైకిల్ గట్టి పోటీ ఇవ్వనుంది.

# మూడో కంటికి చిక్కని 'సిగ్నల్'.. ఈ యాప్ గురించి తెలుసా?

**వాట్సాప్ మాదిరిగానే.. అమెరికాలో 'సిగ్నల్' అనే మెసేజింగ్ యాప్‌ను చాటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. తాజాగా ఈ యాప్ నుంచే యెమెన్ వైమానిక దాడులకు సంబంధించిన ప్రణాళికలు బయటకు పొక్కాయి. ఈ నేపథ్యంలో ఈ యాప్ కోసం ఆరా తీసేవాళ్లు పెరిగిపోయారు. ఇంతకీ ఈ యాప్ ఏమిటి?, దీనిని ఎవరు ప్రారంభించారు?.. అమెరికా అధ్యక్ష భవనం సిబ్బంది ఈ యాప్‌ను వినియోగించడానికి ఏమైనా ప్రత్యేకత ఉందా?.. వివరాల్లోకి వెళ్తే..**

సిగ్నల్ అనేది మెసేజింగ్ యాప్. దీనిని 'మోక్సీ మార్లిన్‌స్పైక్' రూపొందించారు. సిగ్నల్ యాప్ ద్వారా టెక్స్ట్ మెసేజస్, ఫోటోలు, రికార్డ్స్ వంటివి షేర్ చేసుకోవచ్చు. వాట్సాప్ తరహాలోనే మెసేజ్ పంపిన వారు, రిసీవ్ సీగేసుకున్న వారు మాత్రమే సందేశాలను చూడగలరు. ఒక నిర్ణీత సమయం తరువాత సమాచారం కనిపించకుండా చేసే ఆప్షన్ కూడా ఇందులో ఉంది. మూడో మనిషి చూడటానికి అవకాశం లేదు. అయితే..

సిగ్నల్‌కు వాట్సాప్ కంటే అత్యంత సురక్షితమైనదనే ప్రచారం ఉంది. సురక్షితమైన యాప్ కావడంవల్లే అమెరికాలోని ఫెడరల్ అధికారులు, వైట్‌హౌజ్ సిబ్బంది దీనిని ఉపయోగిస్తుంటారు.

సిగ్నల్ మెసేజింగ్ యాప్‌ను ప్రపంచవ్యాప్తంగా.. ఏడు కోట్లమంది ఉపయోగిస్తున్నట్లు(ఇప్పటిదాకా డౌన్‌లోడ్లు) గణాంకాలు చెబుతున్నాయి. దీనిని ఎక్కువ మంది ఉపయోగించడానికి ప్రధాన కారణం.. ఇది సాధారణ వాట్సాప్, మెటా మెసెంజర్ కంటే కూడా సురక్షితమైనది కావడమనే ముద్రపడిపోవడం.




**లీక్ ఇలా..**
యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులపై.. దాడికి సంబంధించిన వ్యూహాలను రహస్యంగా 'సిగ్నల్' యాప్ గ్రూప్‌చాట్‌లో చర్చిస్తూ 'జెఫ్రీ గోల్డ్‌బర్గ్' అనే సీనియర్ పాత్రికేయుడిని ఆ గ్రూప్‌లో చేర్చుకున్నారు. ఆ తరువాత కీలక సమాచారం లీక్ అయ్యి రచ్చ రాజేసింది.

# కశ్మీర్ లోయలో వందేభారత్ పరుగులు..

## వచ్చే నెలలో ప్రారంభించనున్న మోదీ?

**ఏప్రిల్ 19న కట్రా-శ్రీనగర్ మధ్య వందేభారత్ రైలు సర్వీసును ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.**

వందేభారత్ సర్వీసు తొలిసారి కశ్మీర్‌లోయలో కూడా అందుబాటులోకి రానుంది. ఏప్రిల్ 19న కట్రాశ్రీనగర్ మధ్య ప్రత్యేక వందే భారత్ రైల్వే సర్వీసు ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. తర్వాత కట్రాలో బహిరంగ సభలో పాల్గొననున్నారు. వాటితోపాటు జమ్మూకశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనను సందర్శించనున్నారని సమాచారం. తొలుత ఈ రైలు కట్రా నుంచి శ్రీనగర్‌ల మధ్య నడవనుందని, జమ్ము రైల్వేస్టేషన్ విస్తరణ పనులు పూర్తయిన తర్వాత అక్కడినుంచి శ్రీనగర్‌కు దాని సేవలు విస్తరిస్తారని తెలుస్తోంది.

ఇదిలాఉంటే ఇంజినీరింగ్ అద్భుతమైన చీనాబ్ వంతెనపై ఇటీవల తొలిసారి వందే భారత్ రైలు పరుగులు పెట్టింది. ఈ సెమీ హైస్పీడ్ వందేభారత్ రైలు ట్రయల్ రన్‌ను భారత రైల్వే నిర్వహించింది. కట్రాలోని శ్రీ మాతా వైష్ణోదేవి రైల్వేస్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందేభారత్ రైలు ప్రయాణించింది. ఈ మార్గమధ్యంలో చీనాబ్ నది పై నిర్మించిన వంతెన ప్రధాన ఆర్చ్‌పై రైలు పరుగులు పెడుతున్న దృశ్యాలు వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. కశ్మీర్‌లోయలోని అతిశీతల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఈ వందే భారత్ రైలును ప్రత్యేకంగా రూపొందించారు. నీరు గడ్డ కట్టకుండా ఉంచేలా అత్యాధునిక హీటింగ్ వ్యవస్థలను ఇందులో ఏర్పాటుచేశారు.

# కొత్త ఏడాదిలో ఎంపీసీ సమావేశం షెడ్యూల్ విడుదల

**కొత్త ఆర్థిక సంవత్సరం(2025-26) ఏప్రిల్ 1, 2025 నుంచి ప్రారంభం అవుతుంది. వచ్చే ఏడాదికి సంబంధించి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశ షెడ్యూల్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటించింది. ఎంపీసీ సమావేశంలో కీలక వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకుంటారు. దేశ ఆర్థిక వృద్ధిని దృష్టిలో ఉంచుకుని ధరల స్థిరత్వాన్ని కొనసాగించడానికి, ద్రవ్య విధానాన్ని రూపొందించేందుకు ఇందులో నిర్ణయాలు తీసుకుంటారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఎంపీసీ సమావేశం జరిగే తేదీలు కింది విధంగా ఉన్నాయి.**

ఆర్‌బీఐ వచ్చే ఏడాదిలో ఆరుసార్లు ఎంపీసీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. మొదటి సమావేశం 2025 ఏప్రిల్ 79 తేదీల్లో జరగనుంది. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చివరి ఎంపీసీ సమావేశం 2025 ఫిబ్రవరిలో కొత్త ఆర్‌బీఐ బాస్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరిగింది. ఇందులో చాలాకాలం తర్వాత మొదటి సారిగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి చేర్చారు.



**2025-26లో ఎంపీసీ సమావేశాల తేదీలు**
2025 ఏప్రిల్ 7, 8, 9
2025 జూన్ 4, 5, 6
2025 ఆగస్టు 5, 6, 7
2025 సెప్టెంబర్ 29, 30, అక్టోబర్ 1
2025 డిసెంబర్ 3, 4, 5
2026 ఫిబ్రవరి 4, 5, 6

ఆర్థిక వ్యవస్థ అంతటా రుణాలు, డిపాజిట్ రేట్లను ప్రభావితం చేసే రెపో రేటును నిర్ణయించడానికి ఎంపీసీ ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశమవుతుంది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి, కరెన్సీని స్థిరీకరించడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారించడానికి దాని నిర్ణయాలు కీలకంగా మారుతాయి.

**ఆర్‌బీఐ ఎంపీసీ సభ్యులు వీరే..**
ఎంపీసీ సమావేశాల్లో మొత్తం ఆరుగురు సభ్యులుంటారు. అందులో ముగ్గురు సభ్యులు సెంట్రల్ బ్యాంక్‌కు చెందినవారు ఉంటారు. అందులో గవర్నర్ మానిటరీ పాలసీ సమావేశానికి ఇన్‌ఛార్జీగా, డిప్యూటీ గవర్నర్, ఆర్‌బీఐ బోర్డు ఎంపిక చేసిన మరొక అధికారి ఉంటారు. మరో ముగ్గురిని ప్రభుత్వం నియమిస్తుంది. ఈ కమిటీకి ఆర్బీఐ గవర్నర్ నేతృత్వం వహిస్తారు. ప్రస్తుతం ఉన్న సభ్యులు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా, ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాజీవ్ రంజన్, డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వర్ రావు, నగేష్ కుమార్, సౌగతా భట్టాచార్య, ప్రొఫెసర్ రామ్ సింగ్ ఉన్నారు.

# వాళ్లకు మాత్రం ఏఐ ముప్పు ఉండదు.. బిల్ గేట్స్

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశ్రమలను వేగంగా మార్చివేసింది. ముఖ్యంగా 2022లో చాట్‌జీపీటీ వచ్చినప్పటి నుంచి దీని విస్తృతి మరింతగా పెరిగింది. చాలా మంది తమ రోజువారీ జీవితంలో, వృత్తుల్లో జెమినీ, కోపైలట్, డీప్‌సీక్ వంటి చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నారు. దీని ప్రయోజనాలు ఎలా ఉన్నా సరే.. మానవ ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాగేసుకుంటుందన్న ఆందోళనలు మాత్రం ఉద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.**

ఈ సరికొత్త సాంకేతిక విప్లవం నడుమ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్.. కనీసం కొన్ని రోజులైనా కృత్రిమ మేధ ఆధారిత ఆటోమేషన్ నుండి సురక్షితంగా ఉండటానికి అవకాశం ఉన్న వృత్తులపై తన భావాలను పంచుకున్నారు. ఇటీవలి ఇంటర్వ్యూలో గేట్స్ ప్రత్యేకమైన మానవ నైపుణ్యాలు అవసరమయ్యే మూడు కీలక రంగాలను హైలైట్ చేశారు. అవి కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ.
కోడర్లు.. వీళ్లే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆర్కిటెక్ట్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి బాధ్యత వహించే నిపుణులు తమ ఉద్యోగాలను నిలుపుకునే అవకాశం ఉంది. ఏఐ కోడ్ జనరేట్ చేయడం, కొన్ని ప్రోగ్రామింగ్ పనులను ఆటోమేట్ చేయడంలో పురోగతి సాధించినప్పటికీ, సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడానికి అవసరమైన ఖచ్చితత్వం, లాజిక్, సమస్య పరిష్కార నైపుణ్యాలు దీనికి లేవు. డీబగ్గింగ్ చేయడానికి, రిఫైనింగ్ చేయడానికి, మరోపక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మెరుగుపరచడానికి కూడా హ్యూమన్ ప్రోగ్రామర్లు



**ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్**
శిలాజ ఇంధనాలు, అణుశక్తి, పునరుత్పాదక ఇంధన వనరులతో కూడిన ప్రపంచ ఇంధన రంగం అత్యంత సంక్లిష్టమైనది. కృత్రిమ మేధస్సు.. సామర్థ్యాన్ని మెరుగుపరచడం, డిమాండ్‌ను అంచనా వేయడం, మౌలిక సదుపాయాలను నిర్వహించడంలో సహాయపడుతుంది. అయితే ఇది ఇంధన పరిశ్రమను నిర్వచించే సంక్లిష్టమైన నియంత్రణ భూభాగాలు, భౌగోళిక రాజకీయ సవాళ్లు, అనూహ్య మార్కెట్ హెచ్చుతగ్గులను స్వతంత్రంగా నిర్వహించలేదు. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో, సుస్థిర పరిష్కారాలను అమలు చేయడంలో, విద్యుత్ అంతరాయాలు లేదా వనరుల కొరత వంటి సంక్షోభాలకు ప్రతిస్పందించడంలో మానవ నైపుణ్యం కీలకమని గేట్స్ నొక్కి చెప్పారు.

**జీవశాస్త్రవేత్తలు**
జీవశాస్త్రంలో.. ముఖ్యంగా వైద్య పరిశోధన, శాస్త్రీయ ఆవిష్కరణలో మానవ అంతర్దృష్టి, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన అవసరం. కృత్రిమ మేధ పెద్ద మొత్తంలో డేటాను ప్రాసెస్ చేయడంలో, నమూనాలను గుర్తించడంలో రాణిస్తున్నప్పటికీ, ఇది అద్భుతమైన పరికల్పనలను రూపొందించే లేదా పరిశోధనలో సహజమైన పురోగతిని సాధించే సామర్థ్యాన్ని కలిగి ఉండదు. వ్యాధుల నిర్ధారణకు, జన్యుక్రమాలను విశ్లేషించడానికి, ఔషధ ఆవిష్కరణకు మాత్రం ఏఐ సహాయపడుతుందని గేట్స్ పేర్కొన్నారు.



## 'నా డబ్బులతో పారిపోయారు.. కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదు'

**బాలీవుడ్ సింగర్ నేహ కక్కర్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఓ మ్యూజిక్ కన్సర్ట్‌కు వెళ్లారు. కానీ ఆమె ఆ ఈవెంట్‌కు దాదాపు మూడు గంటలు ఆలస్యంగా చేరుకున్నారు. ఆ తర్వాత లేట్‌గా రావడంపై అభిమానులకు క్షమాపణలు కూడా చెప్పారు సింగర్. అయితే నేహాకు ఈవెంట్ ఆర్గనైజర్స్ మాత్రం ఊహించని విధంగా షాకిచ్చారు. ఈవెంట్ ముగిశాక నేహా కక్కర్‌కు ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా పారిపోయారు. ఈ విషయాన్ని నేహా తన సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది.**

నేహా కక్కర్ తన ఇన్‌స్టాలో రాస్తూ.. "నేను మెల్‌బోర్న్ కన్సర్ట్‌ను ప్రేక్షకులకు పూర్తిగా ఉచితంగా ప్రదర్శన ఇచ్చానని మీ అందరికీ తెలుసా? నిర్వాహకులు నా డబ్బుతో పారిపోయారు. నా టీమ్‌కు కనీసం ఆహారం, హోటల్, నీరు కూడా ఇవ్వలేదు. నా భర్త, అతని స్నేహితుల వెళ్లి వారికి ఆహారం అందించారు. అయినా కూడా మేము స్టేజ్‌పైకి వచ్చాం. మేము ఆలస్యంగా వచ్చామని మాకు డబ్బు ఇవ్వలేదు. అంతేకాకుండా నిర్వాహకులు నా మేనేజర్ కాల్ కూడా లిఫ్ట్ చేయలేదు' అని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే ఈ కన్సర్ట్‌కు హాజరైన కొంతమంది కక్కర్‌పై సానుభూతి వ్యక్తం చేయగా.. మరికొందరు ఆలస్యం రావడంపై నిరాశ వ్యక్తం చేశారు.

**అభిమానులకు కృతజ్ఞతలు..**

అయితే సింగర్ నేహా తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపింది. నాకు జరిగిన విషయం గురించి మాట్లాడిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రాసుకొచ్చింది. నా పరిస్థితిని అర్థం చేసుకుని.. ఆ రోజు నా కచేరీకి హాజరైన ప్రతి ఒక్కరినీ హృదయ పూర్వకంగా అభినందిస్తున్నట్లు వెల్లడించింది.

## బుల్లితెర నటి ప్రైవేట్ వీడియో లీక్..
## కొద్ది సేపటికే రికార్డ్ వ్యూస్

సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ గురించి అందరికీ తెలిసిందే. కేవలం సినిమారంగంలోనే కాదు.. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. కాకపోతే సినీరంగంలో ఇలాంటివీ ఇంకాస్త ఎక్కువగా ఉంటాయనే వార్తలు వింటుంటాం. తాజాగా మరోసారి క్యాస్టింగ్ కౌచ్ గురించి చర్చ మొదలైంది. ఏకంగా వీడియో బయటికి రావడంతో ఇంతకీ ఎవరు ఆమె అని నెటిజన్స్ తెగ ఆరా తీస్తున్నారు. ఇంతకీ ఆ వివరాలేంటో తెలుసుకుందాం. అయితే తాజాగా కోలీవుడ్ యంగ్ హీరోయిన్ శృతి నారాయణన్ ప్రైవేట్ వీడియో లీకైందని సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఓ ప్రైవేట్ ఆడిషన్ సమయంలో క్యాస్టింగ్ కౌచ్ గురించి మాట్లాడుతుండగా ఆ వీడియోను రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన దాదాపు 14 నిమిషాల వీడియో నెట్టింట వైరల్ కావడంతో కొద్ది గంటల్లోనే రికార్డ్ స్థాయి వ్యూస్ వచ్చాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ప్రైవేట్ వీడియో లీక్ కావడంతో కోలీవుడ్ హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈ వీడియోపై ఇప్పటి వరకు శృతి నారాయణన్ స్పందించలేదు. అసలు ఆ వీడియోలో ఉన్నది ఆమెనా? కాదా? అనేది తెలియాల్సి ఉంది.

**వీడియో లీక్ తర్వాత మొదటి పోస్ట్..**

అయితే ఈ వీడియో లీక్ తర్వాత శృతి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ప్రైవేట్‌గా మార్చేసింది. అయితే కొద్ది సేపటికే వెంటనే మళ్లీ తన అకౌంట్‌ను పబ్లిక్‌గా మార్చినట్లు తెలుస్తోంది. ఈ సంఘటన తర్వాత మొదటి పోస్ట్‌ను షేర్ చేసింది. బంగారు వర్ణం చీరలో ఉన్న ఫోటోలను పంచుకుంది. కాగా.. శృతి నారాయణన్ తమిళ టీవీ సీరియల్స్‌లో తన కెరీర్‌ను ప్రారంభించింది. 'సిరగదిక్క ఆసై' వంటి సీరియల్ ద్వారా గుర్తింపు తెచ్చుకుంది. జనవరి 2023లో ప్రారంభమైన ఈ షోలో వెట్రి వసంత్‌తో పాటు గోమతి ప్రియ నటించారు. అంతేకాకుండా శృతి నారాయణన్ 'సిటాడెల్: హనీ బన్నీ' (2024), 'కార్తీగై దీపం' (2022), 'మారి' (2022) చిత్రాల్లో కీలక పాత్రలతో మెప్పించారు.



## రెట్టింపు వినోదంతో...




''మ్యాడ్ స్క్వేర్' సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మనస్ఫూర్తిగా నవ్వుకుంటారు. థియేటర్స్‌కి వచ్చిన ప్రతి ఒక్కరూ తాము టిక్కెట్ కోసం పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని భావిస్తారు'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ పేర్కొన్నారు. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు.

సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. బుధవారం నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హారిక సూర్యదేవర మాట్లాడుతూ– ''కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రమిది'' అన్నారు. నార్నే నితిన్ మాట్లాడుతూ– ''మ్యాడ్' సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటాం. ఇప్పుడు 'మ్యాడ్ స్క్వేర్'లో వినోదం రెట్టింపు ఉంటుంది. చూసి ఆనందించండి'' అని తెలిపారు. ''మా ట్రైలర్ అందరికీ నచ్చిందనుకుంటున్నాం. సినిమా కూడా కచ్చితంగా నచ్చుతుంది'' అన్నారు సంగీత్ శోభన్, రామ్ నితిన్.



## మీ వద్ద స్టోరీ ఉందా.. నటిస్తా ఫరియా అబ్దుల్లా

**హన్మకొండ:** 'మీ వద్ద స్టోరీ ఉందా.. వరంగల్‌కు వచ్చి నటిస్తా' అంటూ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా ఛలోక్తి విసిరారు. బుధవారం హనుమకొండ సర్క్యూట్ హౌస్ సమీప గోకుల్‌నగర్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఫరియా అబ్దుల్లాను వరంగల్ లో సినిమాలు తీసే ఆలోచన ఉందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె పైవిధంగా స్పందించారు. ఈ సందర్భంగా స్టేజీపై నృత్యం చేసి అభిమానులను అలరించారు.



## హిస్టారికల్ ప్యారడైజ్

**'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై రూపొందుతోన్న ఈ మూవీ 2026 మార్చి 26న విడుదల కానుంది. కాగా ఈ సినిమా సరిగ్గా 365 రోజుల్లో తెరపైకి రానుందని పేర్కొని, 'వన్ ఇయర్ టు గో... ఇండియన్ సినిమా విట్నెస్ ది మ్యాడ్నెస్' అంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. "ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఇప్పటికే విడుదలైన మా టీజర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ గ్రిప్పింగ్ టీజర్ అందరి దృష్టిని ఆకర్షించి రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ సాధించింది. హైదరాబాద్ చారిత్రక నేపథ్యంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' నానీని మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో చూపించనుంది. సుధాకర్ చెరుకూరి అత్యున్నత స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ సంగీతం, ఏఓ విష్ణు సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. మా చిత్రం తెలుగు, ఇంగ్లీష్, స్పానిష్ సహా 8 భాషల్లో విడుదల కానుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది.**



## 'విశాల్, సదా' మోస్ట్ వెయిటెడ్ స్పెషల్ సాంగ్ వీడియో రిలీజ్

కోలీవుడ్ హీరో విశాల్ నటించిన 'మదగ జరాజా' చిత్రం సుమారు 12 ఏళ్ల తర్వాత ఈ ఏడాది సంక్రాంతికి కోలీవుడ్‌లో విడుదలైంది. ఆపై కొద్దిరోజులకే తెలుగులో కూడా రిలీజ్ అయిన విషయం తెలిసిందే. అయితే, ఎవరూ ఊహించని విధంగా బాక్సాఫీస్ వద్ద రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ ఈ మూవీ సాధించి రికార్డ్ బ్రేక్ చేసింది. సినిమా రన్ టైమ్ ముగిసిపోయి చాలా రోజులు అయింది. అయితే, తాజాగా ఈ మూవీ నుంచి మోస్ట్ వెయిటెడ్ సాంగ్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. విశాల్ హీరోగా సుందర్. సి దర్శకత్వంలో రూపొందిన 'మదగజరాజా' చిత్రాన్ని జెమినీ ఫిలిం సర్క్యూట్ సంస్థ నిర్మించింది. ఇందులో అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ హీరోయిన్స్‌గా నటించారు. హీరోయిన్ సదా కూడా ఒక ఐటెమ్ సాంగ్‌లో కనిపించింది. ఈ పాట వీడియో వర్షన్ కోసం అభిమానులు చాలా రోజులుగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ పాటను యూట్యూబ్‌లో విడుదల చేసింది




## రోహిత్‌ను రోజుకు 20 కి.మీ. పరుగెత్తమని చెబుతా: యోగ్‌రాజ్ సింగ్

**యువరాజ్‌సింగ్ నాన్న, మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. తననే టీమ్‌ఇండియా కోచ్‌ను చేస్తే రోహిత్ శర్మతో రోజుకు 20 కి.మీ. పరుగెత్తిస్తా అన్నాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మను వజ్రాలతో పోల్చాడు. వారిని వదులుకోకూడదన్నాడు.**

యువరాజ్ సింగ్ నాన్న, మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశాడు. తనను టీమ్‌ఇండియాకు కోచ్‌ను చేస్తే హిట్‌మ్యాన్ రోహిత్ శర్మతో రోజుకు 20 కి.మీ పరుగెత్తిస్తా అన్నాడు. అలాగే కోహ్లీతో రంజీ మ్యాచ్‌లు ఆడిస్తా అని ఓ ఛానల్ పాడ్‌కాస్ట్‌లో తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'నేనే టీమ్ ఇండియా కోచ్‌నైతే ఇదే జట్టును కొనసాగిస్తాను. ఇప్పుడు కొందరు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని టీమ్ నుంచి తీసేయాలి అంటున్నారు. ప్రస్తుతం వారు మంచి ఫామ్‌లో లేరు. నాకు పిల్లలతో సమానమైన వారికి ఈ సమయంలో అండగా ఉంటా. నేను వారిని రంజీల్లో ఆడమని కోరతా. రోహిత్ శర్మను రోజుకు 20కి.మీ. పరుగెత్తమని చెబుతా. ఈ ఇద్దరు ఆటగాళ్లు టీమ్‌ఇండియాకు దొరికిన వజ్రాలు. వీరిని వదులుకోకూడదు. నేను వారికి తండ్రిలాంటి వాణ్ని. నేను యువరాజ్ సింగ్, ఇతర ఆటగాళ్ల మధ్య తేడా చూపించను. ధోనీ విషయంలోనూ అంతే. కానీ తప్పును మాత్రం తప్పు అని చెబుతా' అని యోగ్‌రాజ్ సింగ్ అన్నాడు.

ధోనీ తర్వాత ఎక్కువ ఐసీసీ టైటిల్స్ గెలిచిన టీమ్‌ఇండియా కెప్టెన్‌గా రోహిత్ శర్మ రికార్డ్ సృష్టించాడు. కానీ కొంతకాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ మధ్య రోహిత్ రిటైర్మెంట్‌పై పలు ఊహాగానాలు వినిపించాయి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ లో విజయం సాధించిన తర్వాత వాటన్నింటినీ రోహిత్ శర్మ పటాపంచలు చేశాడు. వన్డే ఫార్మాట్ నుంచి ఇప్పుడప్పుడే తనకు తప్పుకునే ఉద్దేశం లేదని చెప్పాడు. రోహిత్ మరి కొన్ని రోజుల్లో 38వ సంవత్సరంలోకి అడుగు పెట్టనున్నాడు. ఈ నేపథ్యంలో టెస్టు క్రికెట్ లో అతడి భవిష్యత్తు గురించి పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ దశలో యోగ్‌రాజ్‌సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ అయిన యోగ్‌రాజ్ సింగ్ గతంలోనూ అర్జున్ తెందూల్కర్‌కు 12 రోజుల శిక్షణ ఇచ్చాడు. దీని తర్వాతే అతడు గోవా తరపున ఆడిన తన మొదటి ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో సెంచరీ చేశాడు. అర్జున్‌ను తనకు మరోసారి అప్పగిస్తే కేవలం ఆరునెలల్లో అతణ్ని ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్‌ను చేస్తా అని ఈ మధ్యే యోగ్‌రాజ్‌సింగ్ అన్న విషయం తెలిసిందే.





## ఆ ఇద్దరిపై వేటు.. టీమ్‌ఇండియా కోచింగ్ బృందంలో మార్పులు?

**భారత జట్టు సపోర్ట్ స్టాఫ్ జంబో ప్యాక్‌లా ఉంటుంది. ఇప్పుడు ఇందులో భారీ మార్పులు చేయాలని బీసీసీఐ భావిస్తోన్నట్లు వార్తలు వస్తున్నాయి.**

ఐపీఎల్ ముగిసిన తర్వాత.. భారత జట్టు టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం అక్కడి పర్యటించనుంది. ప్రస్తుతం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్లినట్లు సమాచారం. తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఇంగ్లాండ్ పర్యటన నాటికి టీమ్‌ఇండియా సహాయక స్టాఫ్‌లో బీసీసీఐ భారీ మార్పులను చేయనుందని వార్తలు వస్తున్నాయి. జట్టుతో పాటు జంబో సపోర్ట్ స్టాఫ్‌ను పంపించేందుకు బీసీసీఐ అనాసక్తి కనబరుస్తోంది. ఈ క్రమంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మార్చి 29న గువాహటిలో సమావేశం కానున్నట్లు సమాచారం.

**వారిద్దరిని తప్పించి..**

రాహుల్ ద్రవిడ్ తర్వాత ప్రధాన కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. తనకు సహాయం అందించేందుకు ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లు, బౌలింగ్ కోచ్‌ను పెట్టుకొన్నాడు. రైన్ టెన్ డస్కతే, అభిషేక్ నాయర్‌లు అసిస్టెంట్ కోచ్‌లు. మోర్నీ మోర్కెల్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించుకున్నాడు. ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్‌ను కొనసాగించాడు. సితాన్షు కోటక్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించాడు. ఛాంపియన్స్ ట్రోఫీగా విజేతగా నిలవడంలో వీరందరూ కీలక పాత్రే పోషించారు. ఈ క్రమంలో రాబోయే ఇంగ్లాండ్ పర్యటనకు ప్రత్యేకంగా అసిస్టెంట్ కోచ్, ఫీల్డింగ్ కోచ్ అవసరం లేదని బీసీసీఐ భావిస్తోంది. దీంతో అభిషేక్ నాయర్, దిలీప్‌ను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే జట్టుతోపాటు ఉన్న సితాన్షు, మోర్నీ మోర్కెల్ పదవులకు ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చు. అయితే, గౌతమ్ గంభీర్ నిర్ణయం ఎలా ఉంటుంది.. కచ్చితంగా సపోర్ట్ స్టాఫ్ కావాలంటే బీసీసీఐ ఏం చేస్తుందో కూడా ఆసక్తికరమేనని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## అలాంటి నిర్ణయాలు ఎందుకు: పంత్, గిల్ కెప్టెన్సీపై సెహ్వాగ్ విమర్శలు

**ఐపీఎల్‌లో యువ కెప్టెన్ల పనితీరుపై మాజీ క్రికెటర్ సెహ్వాగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. దూకుడుగా, యాక్టివ్‌గా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించాడు.**

ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తమ తొలి మ్యాచుల్లో ఓటమిని చవిచూశాయి. పంజాబ్ చేతిలో 11 పరుగుల తేడాతో గుజరాత్ ఓడింది. ఇక దిల్లీ క్యాపిటల్స్‌తో చివరివరకూ పోరాడిన లఖ్‌నవూకు పరాజయం తప్పలేదు. ఈక్రమంలో రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నాడు. ఉప్పల్ వేదికగా ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లఖ్‌నవూ తలపడనుంది. దూకుడుగా ఆడే ఎస్‌ఆర్‌హెచ్‌ను కట్టడి చేయడంలో పంత్ దూకుడైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని సెహ్వాగ్ సూచించాడు.

**పంత్.. అదే కదా నీ పని**

''తుది జట్టులో ఉన్న బౌలర్లను సరిగ్గా సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత కెప్టెన్‌పై ఉంటుంది. ఒకవేళ అవేశ్ ఖాన్ ఉన్నా సరే శార్దూల్ ఠాకూర్ మాదిరిగా తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు తీసేవాడు కాదేమో. ఇక్కడ దిల్లీ కేవలం ఒక్క ఓవర్‌లోనే గెలవలేదు. చివరివరకూ పోరాడి విజయం సాధించింది. లఖ్‌నవూ మ్యాచ్‌ను చేజేతులా మిస్ చేసుకుంది. తుది జట్టులో లేని వారి గురించి కాకుండా.. ఉన్నవారితో ఎలా గెలవచ్చనేది కెప్టెన్ ఆలోచించాలి. రిషభ్ పంత్ చేయాల్సిందదే. సరైన సమయంలో సరైన బౌలర్లను తీసుకురావాలి. ఈ ట్రిక్‌ను పంత్ మిస్ అయినట్లు అనిపించింది'' అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు.

**గిల్.. గొప్పగా ఏమీ లేదు**

''శుభ్‌మన్ గిల్ సారథ్యం స్థాయికి తగ్గట్టు లేదు. అతడు సిద్ధంగా లేడనిపిస్తోంది. ఉత్సాహంగానూ లేదు. ఇలా అనడానికి కారణాలున్నాయి. సిరాజ్ బౌలింగ్ అద్భుతంగా వేస్తున్నప్పుడు.. అతడిని పక్కనపెట్టి అర్షద్ ఖాన్‌ను తీసుకొచ్చాడు. పవర్‌ప్లేలో 21 పరుగులు ఇచ్చాడు. అక్కడితో పంజాబ్ ఇన్నింగ్స్‌కు ఊపు వచ్చింది. ఒకవేళ సిరాజ్‌తో కొనసాగించి ఉంటే.. పరిస్థితి వేరుగా ఉండేది. అతడిని డెత్ ఓవర్లకు తీసుకురావాల్సిన అవసరం లేదు. బౌలర్లను సద్వినియోగం చేసుకోవడంలో గిల్ ఇంకాస్త యాక్టివ్‌గా ఉండాలి'' అని సెహ్వాగ్ తెలిపాడు.

# దంచికొట్టిన పూరన్, మార్ష్..

# లఖ్‌నవూ చేతిలో హైదరాబాద్ ఓటమి

సొంతగడ్డపై హైదరాబాద్ ఓటమిపాలైంది. లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో ఓడిపోయింది.

**హైదరాబాద్:** ఐపీఎల్ 18 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బోణీ కొట్టింది. దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గెలుపు అంచుల వరకు వెళ్లి ఓటమి చవిచూసిన లఖ్‌నవూ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 191 పరుగుల లక్ష్యాన్ని లఖ్‌నవూ సునాయసంగా ఛేదించింది. 16.1 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి తొలి విజయాన్ని నమోదు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ నికోలస్ పూరన్ (70; 26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) మరోసారి ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డాడు. ఓపెనర్ మిచెల్ మార్ష్ (52; 31 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా చెలరేగాడు. వీరిద్దరు దూకుడుగా ఆడటంతో 191 పరుగుల లక్ష్యం చూస్తుండగానే కరిగిపోయింది. హైదరాబాద్ బౌలర్లలో కమిన్స్ 2, మహ్మద్ షమి, ఆడమ్ జంపా, హర్షల్ పటేల్ ఒక్కో వికెట్ తీశారు.





**అనికేత్ మెరుపులు**

క్లాసెన్ ఔటైన తర్వాత వచ్చిన అనికేత్ ఆరంభం నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. నితీశ్ ఔటైనా మరో ఎండ్‌లో అనికేత్ చెలరేగాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదిన అతను.. దిగ్వేశ్ బౌలింగ్‌లోనూ వరుసగా మరో రెండు సిక్స్‌లు బాది తర్వాతి బంతికే డేవిడ్ మిల్లర్‌కు చిక్కాడు. ఎదుర్కొన్న మూడు బంతులను స్టాండ్స్‌లోకి పంపి జోరుమీదున్న కమిన్స్‌ను అవేశ్ ఖాన్ వెనక్కి పంపాడు. చివరి రెండు ఓవర్లలో సన్‌రైజర్స్ 10 పరుగులే చేయడంతో స్కోరు 190కే పరిమితమైంది.

**పూరన్ విధ్వంసం**

లక్ష్యఛేదనలో ఓపెనర్ మార్క్రమ్ (1) త్వరగానే నిష్క్రమించినా తర్వాత వచ్చిన పూరన్ ఫోర్లు, సిక్సర్లతో ఉప్పల్ మైదానంలో విధ్వంసం సృష్టించాడు. సిమర్‌జిత్ బౌలింగ్‌లో ఓ ఫోర్, వరుసగా రెండు సిక్స్‌లు బాది జోరందుకున్నాడు. ఇక షమి బౌలింగ్‌లో మార్ష్ సైతం రెండు సిక్సర్లు కొట్టి రేసులోకి వచ్చాడు. తర్వాత అభిషేక్ వేసిన ఐదో ఓవర్‌లో పూరన్ వరుసగా రెండు బంతులను స్టాండ్స్‌లోకి పంపాడు. జంపా బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదేశాడు. ఈ క్రమంలోనే 18 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. పూరన్, మార్ష్ దూకుడు ఆటతో 8 ఓవర్లలోనే స్కోరు 100 దాటింది. అయితే, కమిన్స్ తన వరుస ఓవర్లలో పూరన్, మార్ష్‌ను పెవిలియన్‌కు పంపాడు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

### ఆరంభంలోనే వరుస షాక్‌లు

ఇన్నింగ్స్ ఆరంభంలోనే సన్‌రైజర్స్‌కు వరుస షాక్‌లు తగిలాయి. తొలి రెండు ఓవర్లలో 15 పరుగులు వచ్చాయి. ఇన్నింగ్స్ మూడో ఓవర్ వేసిన శార్దూల్ ఠాకూర్ వరుస బంతుల్లో రెండు వికెట్లు పడగొట్టి సన్‌రైజర్స్‌ను గట్టిదెబ్బ కొట్టాడు. అభిషేక్ శర్మ పూరన్‌కు క్యాచ్ ఇవ్వగా.. గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్ కిషన్ ఎదుర్కొన్న తొలి బంతికే పంత్‌కు క్యాచ్ ఇచ్చి గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మరోవైపు, ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడాడు. అవేశ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్ బాదాడు. రవి బిష్ణోయ్ వేసిన ఆరో ఓవర్‌లో పూరన్, బిష్ణోయ్ క్యాచ్‌లు వదిలేయడంతో హెడ్‌కు రెండు జీవదానాలు లభించాయి. అయితే, వచ్చిన లైఫ్‌లను అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ప్రిన్స్ యాదవ్ బౌలింగ్ భారీ షాట్ ఆడే క్రమంలో హెడ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో అంపైర్ కాల్‌తో ఎల్బీడబ్ల్యూ నుంచి నితీశ్ తప్పించుకోగా కాసేపటికే బౌలర్స్ ఎండ్‌లో క్లాసెన్ రనౌట్ అయ్యాడు.

జంపా బౌలింగ్‌లో హర్షల్ పటేల్ అద్భుతమైన రన్నింగ్ క్యాచ్ అందుకోవడంతో ఆయుష్ బదోని (6) ఔటయ్యాడు. రిషభ్ పంత్ (15)ని హర్షల్ వెనక్కి పంపాడు. అబ్దుల్ సమద్ (22*; 8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (13*; 7 బంతుల్లో 2 ఫోర్లు) సైతం దూకుడుగా జట్టుకు భారీ విజయాన్ని అందించారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. తొలుత ట్రావిస్ హెడ్ (47; 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా.. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన అనికేత్ వర్మ (36; 13 బంతుల్లో) క్రీజులో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. నితీశ్ రెడ్డి (32; 28 బంతుల్లో), హెన్రిచ్ క్లాసెన్ (26; 17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేశారు. పాట్ కమిన్స్ (18; 4 బంతుల్లో) హ్యాట్రిక్ సిక్స్‌లు బాది ఔటయ్యాడు. అభిషేక్ శర్మ (6), ఇషాన్ కిషన్ (0) తీవ్ర నిరాశపర్చారు. లఖ్‌నవూ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4/34) అదరగొట్టాడు. అవేశ్ ఖాన్, దిగ్వేశ్ రాఠీ, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.



ఇది 'గ్రోక్' మాట..

## సన్‌రైజర్స్‌పై రిషభ్ పంత్ ఎన్ని పరుగులు చేస్తాడంటే?

**సన్‌రైజర్స్ హైదరాబాద్ తో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తలపడేందుకు సిద్ధమవుతోంది. రిషభ్ పంత్ ఈసారైనా రాణిస్తాడా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.**

ఉప్పల్ మైదానం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య ఇవాళ మ్యాచ్ జరగనుంది. ట్రావిస్ హెడ్ అభిషేక్ శర్మ ఓపెనింగ్ జోడీ ఆటతోపాటు ఇషాన్ కిషన్, నితీశ్‌కుమార్, క్లాసెన్ దూకుడును చూసేందుకు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరోవైపు లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా ఆడతాడనేది ఆసక్తికరమే. దిల్లీతో జరిగిన మ్యాచ్‌లో ఆరు బంతులు ఎదుర్కొన్నా పరుగుల ఖాతా తెరవలేదు. డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే ఉప్పల్ మైదానంలో ఎన్ని పరుగులు చేస్తాడనేది ఊహించడం కష్టమే. కానీ, ఓ క్రికెట్ అభిమాని అడిగిన ప్రశ్నకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ గ్రోక్ సమాధానం ఇచ్చింది.

''పంత్ టాలెంట్‌కు, పిచ్ పరిస్థితులను బట్టి అతడి ఇన్నింగ్స్ మంచిగా ప్రారంభమైతే కనీసం 25 నుంచి 50 పరుగులు చేస్తాడు. ఎల్‌ఎస్‌జీ సారథిగా, కీలక బ్యాటర్‌గా రిషభ్ పంత్ టాప్ ఆర్డర్‌లో వస్తాడు. మూడు లేదా నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయొచ్చు. ఐపీఎల్ కెరీర్‌లో 148 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. దూకుడుగా ఎలా ఆడటమో అతడికి తెలుసు. మ్యాచ్‌కు తగినట్లుగా ఇన్నింగ్స్‌లు ఆడతాడు. లఖ్‌నవూ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంటే.. అతడు కనీసం 30 40 పరుగులు చేస్తాడని కొన్ని 'ఎక్స్' ఖాతాల్లో షేర్ అవుతోంది. ఇది కేవలం ఫ్యాన్స్ అంచనాలు మాత్రమే'' అని ఏఐ చాట్‌బాట్ పేర్కొంది.

**ఐపీఎల్‌లో ఇవీ పంత్ గణాంకాలు**

గత సీజన్ వరకు దిల్లీకి ప్రాతినిధ్యం వహించిన రిషభ్‌పంత్ ఈసారి లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సారథిగా వచ్చాడు. మొత్తం 112 మ్యాచ్‌లు ఆడిన పంత్ 3,284 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే, ఈసారి మాత్రం తొలి మ్యాచ్‌లో పరుగులేమీ చేయలేదు. ఇటు వికెట్ కీపింగ్‌లోనూ విఫలం కావడం ఆ జట్టు అభిమానులను కలవరానికి గురి చేస్తోంది. కెప్టెన్సీలోనూ దూకుడుగా ఆడేలా నిర్ణయాలు తీసుకోవాలని విశ్లేషకులు సూచించారు.

## హెడ్, అనికేత్ మెరుపులు..

## లఖ్‌నవూ టార్గెట్ 191



**పీఎల్ 2025లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడుతోంది.**

**హైదరాబాద్:** ఐపీఎల్ 2025లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడుతోంది. ఉప్పల్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. తొలుత ట్రావిస్ హెడ్ (47; 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా.. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన అనికేత్ వర్మ (36; 13 బంతుల్లో) క్రీజులో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. నితీశ్ రెడ్డి (32; 28 బంతుల్లో), హెన్రిచ్ క్లాసెన్ (26; 17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేశారు. పాట్ కమిన్స్ (18; 4 బంతుల్లో) హ్యాట్రిక్ సిక్స్‌లు బాది ఔటయ్యాడు. అభిషేక్ శర్మ (6), ఇషాన్ కిషన్ (0) తీవ్ర నిరాశపర్చారు. లఖ్‌నవూ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4/34) అదరగొట్టాడు. అవేశ్ ఖాన్, దిగ్వేశ్ రాఠీ, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

**ఆరంభంలోనే వరుస షాక్‌లు**

ఇన్నింగ్స్ ఆరంభంలోనే సన్‌రైజర్స్‌కు వరుస షాక్‌లు తగిలాయి. తొలి రెండు ఓవర్లలో 15 పరుగులు వచ్చాయి. ఇన్నింగ్స్ మూడో ఓవర్ వేసిన శార్దూల్ ఠాకూర్ వరుస బంతుల్లో రెండు వికెట్లు పడగొట్టి సన్‌రైజర్స్‌ను గట్టిదెబ్బ కొట్టాడు. అభిషేక్ శర్మ పూరన్‌కు క్యాచ్ ఇవ్వగా.. గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్ కిషన్ ఎదుర్కొన్న తొలి బంతికే పంత్‌కు క్యాచ్ ఇచ్చి గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మరోవైపు, ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడాడు. అవేశ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్ బాదాడు. రవి బిష్ణోయ్ వేసిన ఆరో ఓవర్‌లో పూరన్, బిష్ణోయ్ క్యాచ్‌లు వదిలేయడంతో హెడ్‌కు రెండు జీవదానాలు లభించాయి. అయితే, వచ్చిన లైఫ్‌లను అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ప్రిన్స్ యాదవ్ బౌలింగ్ భారీ షాట్ ఆడే క్రమంలో హెడ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో అంపైర్ కాల్‌తో ఎల్బీడబ్ల్యూ నుంచి నితీశ్ తప్పించుకోగా కాసేపటికే బౌలర్స్ ఎండ్‌లో క్లాసెన్ రనౌట్ అయ్యాడు.

**అనికేత్ మెరుపులు**

క్లాసెన్ ఔటైన తర్వాత వచ్చిన అనికేత్ ఆరంభం నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. నితీశ్ ఔటైనా మరో ఎండ్‌లో అనికేత్ చెలరేగాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదిన అతను.. దిగ్వేశ్ బౌలింగ్‌లోనూ వరుసగా మరో రెండు సిక్స్‌లు బాది తర్వాతి బంతికే డేవిడ్ మిల్లర్‌కు చిక్కాడు. ఎదుర్కొన్న మూడు బంతులను స్టాండ్స్‌లోకి పంపి జోరుమీదున్న కమిన్స్‌ను అవేశ్ ఖాన్ వెనక్కి పంపాడు. చివరి రెండు ఓవర్లలో సన్‌రైజర్స్ 10 పరుగులే చేయడంతో స్కోరు 190కే పరిమితమైంది.